క్లుప్తంగా

నేడు మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలు


విలేకరులతో మాట్లాడుతున్న డేవిడ్‌రాజు

కొత్తపేట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జయప్రదం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, అమ్ముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శనివారం మాజీ సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా కొత్తపేటలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సారథ్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తొలిత స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం పుట్టినరోజు కేకు కట్ చేసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తారన్నారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్ రెడ్డి చంటి, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి ముసునూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం అంబాజీపేట బస్టాండ్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

మామిడికుదురు: ధనుర్మాసం సందర్భంగా అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి సన్నిధిలో గోదాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. తెల్లవారు జామున తీర్థపు బిందెతో వైనతేయ గోదావరి నది నుంచి జలాలు తీసుకు వస్తూ గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ పండితుల ఆధ్వర్యంలో తిరుప్పావై పాశురం, సేవాకాలం వైభవంగా జరిపించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

రావులపాలెం: ప్రతి ఒక్కరూ నిరు పేదలకు అండగా ఉండాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ రౌతు ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం రావులపాలెంలో రౌతు కాశీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు.

దోమలను నివారించాలి

అంబాజీపేట: మలేరియా, చికున్ గున్యాకు కారణమయ్యే దోమల నివారణకు ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తున్నట్లు ఎస్‌పీబీడీసీపీ సబ్ యూనిట్ అధికారి ఎన్‌వీ రామారావు, సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. ఇసుకపూడి కాకరవారిపేటలో డ్రైడే ఫ్రైడే నిర్వహించారు.

కేసు నమోదు తగదు

మలికిపురం: పార్లమెంట్ ఆవరణలో గురువారం ఎంపీల మధ్య తోపులాటలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సరికాదని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు అన్నారు. శుక్రవారం లక్కవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికార బీజేపీ ఎంపీలు కావాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలను నెట్టేశారని ఆరోపించారు. అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ కో ఆర్డినేటర్ చిలకపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

కార్యవర్గం కొనసాగింపు

రాజోలు: పొన్నమండ ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గాన్ని కొనసాగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని సొసైటీ చైర్మన్ కుసుమ రాజ్ కుమార్ శుక్రవారం తెలిపారు. సొసైటీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఇటీవల కార్యవర్గాన్ని రద్దు చేశారన్నారు. దీంతో హైకోర్టును ఆశ్రయించగా 2027 సెప్టెంబర్ 11 వరకూ వారి పదవీ కాలం కొనసాగించవచ్చని హైకోర్టు స్పష్టం చేసిందన్నారు. కాగా చైర్మన్‌గా కుసుమ రాజ్‌కుమార్, సెక్రటరీగా నల్లి సూర్యం, డైరెక్టర్లుగా కుసుమ వెంకటేశ్వరరావు, ఉండ్రు రాజబాబు, పోతుల రాజారావులను కొనసాగించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు.

విద్యార్థుల ర్యాలీ

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికారత సెల్ కన్వీనర్ జి.సుమలత ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు గృహహింస నివారణ చట్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనికి ప్రత్యేక అతిథిగా రాజమహేంద్రవరానికి చెందిన న్యాయవాది ఎస్.విమల హాజరై మాట్లాడారు.

పోలీసుల బందోబస్తు

రావులపాలెం: ప్రియుడి ఇంటి ముందు దీక్ష చేయడంతో పాటు ఇంట్లోకి ప్రవేశించడంతో, పోలీసులు వారిని బయటకు పంపించేశారు. కొమరాజులంకకు చెందిన గంధ్రోతు హరికృష్ణ అదే గ్రామానికి చెందిన యామిని ఝాన్సీ ప్రేమించుకోవడం, ఇటీవల పెళ్లి చేసుకున్నామని తర్వాత ప్రియుడి ఇంటికి వెళ్లగా మెడలోని తాళిని అతని తల్లి తెంచేసి బయటకు గెంటేశారని, ప్రియుడి ఇంటి ముందు ఝాన్సీ దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిపై ఇరువర్గాల పెద్దలతో పోలీసులు చర్చలు జరిపినా విఫలమయ్యాయి. తనకు న్యాయం చేయాలంటూ ఝాన్సీ, ఆమె కుటుంబ సభ్యులు హరికృష్ణ ఇంట్లోకి ప్రవేశించడంతో వారిని పోలీసులు బయటకు తీసుకువచ్చారు. ఝాన్సీని ఆమెకు ఇంటి తీసుకువెళ్లి వదిలిపెట్టారు. ఆ ప్రాంతంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

మంచుకొచ్చింది..

- గ్రామాలను వణికిస్తున్న చలి
- దీనికితోడు తీవ్రమైన శీత గాలులు
- రోగాల బారిన ప్రజలు


మలికిపురంలో రోడ్డును కమ్మేసిన మంచు

మలికిపురం: శీతాకాలం వచ్చేసింది.. చలి చంపేస్తోంది.. జనాన్ని వణికిస్తోంది.. ఉదయమైనా చలి గాలులు తగ్గకపోవడంతో జనం ఆపసోపాలు పడేలా చేస్తోంది. ఆపై వాయుగుండం కారణంగా వారం రోజులుగా వీస్తున్న గాలులతో ప్రజలను ఇబ్బందుల పాల్జేస్తోంది. మలికిపురం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో దాదాపు ఇదే పరిస్థితి. ఆయా గ్రామాల్లో చలి గాలుల తీవ్రత అధికమై ఎండ ఎక్కడా కనిపించడం లేదు. పొద్దుకనబడడం లేదు. ఫలితంగా రాజోలు, పి.గన్నవరంలోని తీర గ్రామాలను చలి తీవ్రంగా వేధిస్తోంది. రాత్రి పూటతో పాటు పగలూ ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోవడంతో వారం రోజులుగా రాజోలు దీవిలో ప్రజలు విలవిల్లాడుతున్నారు. చాలామంది రోగాల బారిన పడుతున్నారు. మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు మండలాల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సార్వా మసూళ్లతో పాటు, దాళ్వా నాట్లకు కూడా రైతులు ముందుకు సాగుతున్నారు. చలి అధికంగా ఉన్నప్పటికీ పనులకు వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. తెలవారు తుండగానే కూలీలు పనులకు వెళ్తుండడం చాలా గ్రామాల్లో కనిపిస్తోంది. అలాగే వివిధ వివిధ వృత్తులకు వెళ్లాల్సిన ప్రజలు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు కూడా చలి కారణంగా అవస్థలు పడుతున్నారు.

రోడ్లు కనిపించక..

సాయంత్రం నుంచి ఉదయం 8 గంటల వరకూ రోడ్లను మంచు దుప్పటి కప్పేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఉంటోంది. ఉదయం సమయంలోనూ వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వాహనదారులు వేగంగా వెళ్లడం ప్రమాదకరమని పోలీసులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న రోగులు

మంచు కారణంగా చాలామంది ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చలితో ప్రతి రోజూ ఆసుపత్రులకు వచ్చే రోగాల సంఖ్య అధికమైందని పీహెచ్‌సీ వర్గాలు పేర్కొంటున్నాయి. సాధారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులతో పోల్చితే మరో 50 మంది అదనంగా వస్తున్నట్లు వెల్లడిస్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చేవారు కచ్చితంగా ఉన్ని దుస్తులు ధరించి రావలని సూచిస్తున్నారు. అలాగే ముఖానికి మంకీ క్యాప్‌లు ధరించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. లేకుంటే శ్వాసకోశ సమస్యలు తప్పవని అంటున్నారు.


చలిలోనూ గుడిమెళ్లంకలో దాళ్వా నాట్లకు నారు తీసుకున్న కూలీలు

చలి గాలులతో జాగ్రత్త



ప్రస్తుతం మంచుతో పాటు చలి గాలులు కూడా వీస్తున్నాయి. ఈ సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. చలికి రక్షణ చర్యలు తీసుకుని బయటకు వెళ్లాలి. లేకుంటే శ్వాసకోశ ద్వారాలు మూసుకు పోవడంతో పాటు ఊపిరి తిత్తుల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పిల్లలు, పెద్దల విషయంలోనూ జాగ్రలు తీసుకోవాలి.
– ఎస్.పాపారావు, ఎంబీబీఎస్, మలికిపురం

రైల్వే లైన్‌కు స్థల పరిశీలన


శానపల్లిలంకలో అధికారులు, రైతులతో చర్చిస్తున్న కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంక, కొత్తపేట గ్రామాల్లో రైల్వే లైన్ నిర్మాణ పనులకు సేకరించిన స్థలాలను కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ శుక్రవారం పరిశీలించారు. రైల్వే లైన్ కోసం సేకరించిన స్థలాలు, రైతులకు ఇవ్వాల్సిన నష్ట పరిహారంపై ఆయన రైతులతో చర్చించారు. అనంతరం స్థానిక సర్వేయర్లతో రైల్వే లైన్ కోసం కేటాయించిన భూమిని సర్వే చేయించారు. ఈ భూమిలో ఇప్పటి వరకూ ఉన్న అనధికారిక కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నరసాపురానికి చెందిన లంకా సూరిబాబు, హైమా దంపతులు రూ.10,116 విరాళం సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు సత్తిబాబుకు అందజేశారు. దాతను సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు.

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం

- సమస్యలపై ప్రస్తావించిన ఎంపీటీసీ సభ్యులు
- బెల్ట్ షాపులు తొలగించాలని డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: స్థానిక మండల పరిషత్ సమావేశం వాడీవేడిగా జరిగింది. తాగునీటి సమస్యతో పాటు బెల్ట్ షాపు వ్యవహారం, ఆర్టీసీ సర్వీసు పొడిగింపు, విద్యుత్ లోటెజ్ సమస్యతో పాటు పలు అంశాలను సభ్యులు ప్రస్తావించారు. ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గానికి రూ.11.50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, వాటితో చేపట్టిన పనులు ముగింపు దశకు చేరుకున్నాయన్నారు. ఇసుక ఉచితమన్నారు, కానీ మండల వ్యాప్తంగా ఇసుక కోసం వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారంటూ నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి ప్రస్తావించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎంపీటీసీ బొంతు నీలిమ అన్నారు. పెదపట్నంలంక జైభీమ్ నగర్‌లో సైతం సమస్య ఉందని సర్పంచ్ చిన్ని, ఎంపీటీసీ జంగమయ్య పేర్కొన్నారు. కుళాయిలకు విద్యుత్ మోటార్లు అమర్చడం వల్ల శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదన్నారు. తక్షణం కుళాయిలకు బిగించిన మోటార్లను తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. బెల్ట్ షాపులను బహిరంగంగా నిర్వహించడం వల్ల తమకు ఇబ్బందులు వస్తున్నాయంటూ పాశర్లపూడిలంక సర్పంచ్ సూర్యప్రకాశరావు అన్నారు. అప్పనపల్లి ఆర్టీసీ సర్వీసును బి.దొడ్డవరం మీదుగా పెదపట్నంలంక వరకు పొడిగించాలని సభ్యులు జంగమయ్య, చిన్ని, వెంకటరమణ, రామశివసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. పాశర్లపూడిలంకలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం పంచాయతీ తీర్మానం చేసిన ప్రాంతంలో సబ్ స్టేషన్ నిర్మించాలని సర్పంచ్ ప్రకాశరావు కోరారు. అక్కడ నిర్మించేందుకు అవకాశం లేదని అధికారులు చెప్పారని ఎమ్మెల్యే గిడ్డి తెలిపారు. మరో ప్రాంతంలో సబ్ స్టేషన్ నిర్మిస్తారని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ కశిరెడ్డి ఆంజనేయులు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో ఇన్‌చార్జి మేనేజర్ అచ్యుతాంబ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు సంస్థలో శుక్రవారం నుంచి వచ్చే నెల 19 తేదీ వరకూ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల సందర్భంగా స్థానిక డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. డోర్ డెలివరీ మాసోత్సవాల విశిష్టతను ఉద్యోగులకు వివరించారు. ప్రతి ఉద్యోగి మూడు బుకింగ్స్ చేసేలా కృషి చేయాలన్నారు. డిపో పరిధి నుంచి పది కిలోమీటర్ల లోపు 50 కిలోల బరువు వరకూ డోర్ డెలివరీ చేయనున్నట్టు తెలిపారు.

యాచకులకు రగ్గుల పంపిణీ

రాజోలు: స్థానికంగా గూడు, నీడ లేక రోడ్ల పక్కన, చెట్ల కింద, బస్ షెల్టర్లలో జీవనం సాగిస్తున్న యాచకులకు ధన విజయ ట్రస్టు శుక్రవారం రగ్గులు పంపిణీ చేసింది. ట్రస్టు వ్యవస్థాపకురాలు రమాబాయ్ ఆధ్వర్యంలో రగ్గులతో పాటు కిరాణా సరకులు, బ్రెడ్‌లు అందజేశారు. రాజోలు, శివకోటి, తాటిపాక ఏరియాలలో సుమారు 50 మందికి వీటిని పంపిణీ చేసినట్టు రమాబాయ్ అన్నారు. ట్రస్టు సభ్యులు, సోంపల్లి మాజీ సర్పంచ్ విప్పర్తి బేబీ నాగలక్ష్మి, సాయిబాబు, దివ్య రేఖ పాల్గొన్నారు.

దోహా ఖతార్‌లో జగన్ జన్మదిన వేడుకలు


దోహా ఖతార్‌లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

సఖినేటిపల్లి: దోహా ఖతార్‌లో శుక్రవారం రాత్రి ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆ వివరాలను ఈ మెయిల్ ద్వారా మీడియాకు తెలిపారు. ఆ దేశంలో మదీనా ఖలీఫాలో పార్టీ కన్వీనర్, రామేశ్వరం ఎన్నారై దొండపాటి శశికిరణ్ ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను శశికిరణ్, నాయకులు కట్ చేశారు. అనంతరం శశికిరణ్ మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు 90 శాతం నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఒక్క హామీనీ చంద్రబాబు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. జమిలి ఎన్నికలు వచ్చినా, 2029లో ఎన్నికలు వచ్చినా ముఖ్యమంత్రిగా తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం ఖాయమని శశికిరణ్ అన్నారు. నాయకులు మండా వర్జిల్‌బాబు, నల్లి నాగేశ్వరరావు, నేతల జయరాజు, మోహన్‌రెడ్డి, మేడంకి రాజు, పెదపాటి సుధాకర్, శేఖర్, బుజ్జి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి


అంబాజీపేటలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

అంబాజీపేట: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి ప్రణాళిక, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఎంపీడీఓ సరోవర్ అధ్యక్షతన శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మండలాల పరిధిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా కృషి చేయాలన్నారు. గ్రామాభివృద్ధి, కుటుంబాల ఆర్థిక ప్రగతికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు పాల్గొన్నారు.

అయినవిల్లి: అన్ని శాఖల సమన్వయంతో పంచాయతీలను అభివృద్ధి వైపు నడిపించాలని ఎంపీడీఓ జి.భీమారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని శాఖల అధికారులు 9 అంశాల ఆధారంగా అభివృద్ధి సాధించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ వాణిశ్రీబెహర తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కృషి చేయాలని ఎంపీడీఓ కేవీ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బీపీడీపీ, జీపీడీపీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం


అంబాజీపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న మండల మాల మహానాడు నాయకులు

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే తన పదవికి రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని అంబాజీపేట మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, దేశానికి అందించిన రాజ్యాంగాన్ని అనుసరించి మంత్రి పదవులు చేపట్టి ఈ రోజున అంబేడ్కర్‌ని అవహేళన చేయడం తగదన్నారు. అంబేడ్కర్ ఖ్యాతిని అనేక దేశాల్లో కీర్తిస్తుంటే, మన దేశంలో వ్యంగంగా మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. తక్షణం నరేంద్ర మోదీ స్పందించాలని, లేదంటే దేశవ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. సర్పంచ్ జల్లి బాలరాజు, నాయకులు నాగాబత్తుల నరసింహమూర్తి, నెల్లి వెంకటరమణ, కోట సత్తిబాబు, యల్లమిల్లి జయబాబు, గోసంగి కుమారస్వామి, నక్కా భాస్కర్ పాల్గొన్నారు.

అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలి

మలికిపురం: పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని రాజోలు తాలూకా మాల మహానాడు సమావేశం డిమాండ్ చేసింది. నాలుగు మండలాల జేఏసీ అధ్యక్షుడు చింతా రాజబాబు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తోటే రాజేష్, మండల అధ్యక్షుడు గెడ్డం పిలిఫ్‌రాజ్, గెడ్డం తులసి భాస్కరరావు, తోటే ప్రతాప్, బత్తుల మురళీకృష్ణ పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోండి


అంబాజీపేటలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్ఓ ఉదయభాస్కర్

అంబాజీపేట: వినియోగదారులు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎ.ఉదయభాస్కర్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామ్మూర్తి అధ్యక్షతన వినియోగదారుల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార భద్రత ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. వస్తువు కొనుగోలు చేసిన సమయంలోనే తప్పని సరిగా రసీదు పొందాలన్నారు. అడ్వకేట్ అద్దంకి అమరేశ్వరరావు మాట్లాడుతూ వినియోదారుల హక్కులు, బాధ్యతలను తెలుసుకుంటే సత్వర న్యాయం పొందవచ్చన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం కడలి సాయిరామ్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఈపీడీసీఎల్ డి.వెంకటేశ్వరరావు, పాఠశాల వినియోగదారుల క్లబ్ కన్వీనర్ ఎండీ ఉన్నీసాబేగం, ఎల్.వెంకటేశ్వరరావు, వి.సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు


మడుపల్లి క్షేత్ర పర్యటనలో తహసీల్దార్ నాగలక్ష్మమ్మ

సఖినేటిపల్లి: గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు తోడ్పడతాయని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం గొంది పంచాయతీ వద్ద తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సర్పంచ్ దొండపాటి రవికుమార్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, సర్వేయర్ భద్రరాజు, ఆర్ఐ వి.రామరాజు, కార్యదర్శి గంగరాజు, రెవెన్యూ సిబ్బంది గెడ్డం మహాలక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.

అంబాజీపేట: రెవెన్యూ సదస్సులకు వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. చిరతపూడిలో సర్పంచ్ కోట బేబి రాణి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. మొత్తం 10 అర్జీలు వచ్చాయి.

అయినవిల్లి: మడుపల్లిలో సర్పంచ్ నిమ్మకాయల వెంకటలక్ష్మి అధ్యక్షతన తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. మొత్తం 20 అర్జీలు వచ్చాయి. అనంతరం గ్రామంలో క్షేత్రస్థాయిలో తహసీల్దార్ పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీటీసీ సభ్యురాలు పంపాని వాణి పాల్గొన్నారు.

రాజోలు: స్థానికంగా సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, డీపీఓ బుచ్చిరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి 11, రైస్ కార్డుల నిమిత్తం 38, గృహనిర్మాణం నిమిత్తం 19, పెన్షన్ల కోసం 51, ఇంటి స్థలాలకు 28, ఇతరులు 3 అర్జీలు అందించారు.

కొత్త కార్యవర్గానికి అభినందన


ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహరాకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు

అయినవిల్లి: పంచాయతీ కాంట్రాక్టు కార్మికుల సంఘ కొత్త కార్యవర్గాన్ని ఎంపీడీఓ జి.భీమారావు, ఈఓ పీఆర్డీ వాణి శ్రీబెహర, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు అభినందించారు. ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులను పంచాయతీ కాంట్రాక్టు కార్మికుల సంఘ అయినవిల్లి మండల అధ్యక్షుడు సుంకర కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గుమ్ములూరి అనిల్‌కుమార్, సెక్రటరీ తాడి శ్రావణ్‌కుమార్, కార్యదర్శి శ్రీనులతో పాటు సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ డిమాండ్ల కూడిన వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోల నాగబాబు, డివిజనల్ నాయకుడు సత్యనారాయణ, నాయకులు గుర్రం రాంబాబు, కాగిత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.